## క్లుప్తంగా

### చెత్తసేకరణను సక్రమంగా చేయండి

మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక



**తెనాలిఅర్బన్:** చెత్త సేకరణను సక్రమంగా నిర్వహించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. 31వ వార్డులో గురువారం ఆమె పర్యటించి స్థానికులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అలాగే వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులు పరిశీలించి పలు సూచలు చేశారు. చెత్తను మూడు బుట్టల విధానంలో సేకరించాలని సూచించారు. ఆమె వెంట 31వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు గోగిరెడ్డి మానసారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు తాడిబోయిన రమేష్, మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ హెలెన్ నిర్మల, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనుపమ, టీపీఎస్ సునీల్, ఆర్‌ఐ మోహన్‌కృష్ణ, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు తదితరులున్నారు.

### 101 మందికి ఆహారం పంపిణీ



**తెనాలి:** అన్ని దానాల్లోకన్నా అన్నదానం విశిష్టమైనదని శ్రీ సాయి ప్రసాదం సేవాసమితి వ్యవస్థాపకుడు సాయి లక్కరాజు అన్నారు. సేవాసమితి ఆధ్వర్యంలో గురువారం స్థానిక చినరావూరులోని ఆంజనేయస్వామి దేవాలయంలో అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ శుభ కార్యాలను వేడుకగా కాకుండా పేదలతో కలిసి చేసుకుంటే దేవుడి ఆశీర్వచనం పొందగలరన్నారు. ఏ కాలనీవారైనా వారి ప్రాంతంలో అన్నప్రసాద వితరణకు ముందుగా తెలియజేస్తే, అక్కడ అన్నదానం చేసేందుకు సిద్ధమని వెల్లడించారు. సమితి సభ్యుడు లక్కరాజు శ్రీనివాసరావు సౌజన్యంతో ఏర్పాటు చేసిన అన్నదానంలో 101 మందికి ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. సభ్యులు కోటేశ్వరరావు, సురేష్ పాల్గొన్నారు.

### రేపు సంస్కృత కళాశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**తెనాలిటౌన్:** పట్టణ గంగానమ్మపేటలోని 110 సంవత్సరాల చరిత్ర కలిగిన తోట లక్ష్మయ్యానాయుడు సంస్కృత కళాశాలలో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం శనివారం కొత్తపేటలోని పెన్షనర్స్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు ఆహ్వాన కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. సమావేశంలో కమిటీ సభ్యులు టి.వినాయకరావు, డి.మురళీకృష్ణ, చావలి రామలింగేశ్వరరావు, ఈఎల్‌వీ అప్పారావు, కేఎస్‌వీ శర్మ, మేడూరి శ్రీనివాసమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

### రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతి

**లక్ష్మీపురం:** రెడ్డిపాలెం, నంబూరు రైల్వే స్టేషన్ల మధ్య గుర్తు తెలియని వ్యక్తి రైలు ఢీకొనడంతో మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. జీఆర్పీ సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. రెడ్డిపాలెం - నంబూరు రైల్వే స్టేషన్ పరిధిలో సుమారు 45 సంవత్సరాల వయస్సున్న గుర్తు తెలియని వ్యక్తి రైలు పట్టాలు దాటుతున్న సమయంలో రైలు ఢీకొని మృతి చెందాడు. సమాచారం అందుకున్న జీఆర్పీ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని చుట్టుపక్కల విచారించగా ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తిగా నిర్ధారించి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. మృతుడు వివరాలు తెలిసిన వారు జీఆర్పీ సీఐ గంగా వెంకటేశ్వర్లు 9440627546, ఎస్‌ఐ జి.వెంకటాద్రి 7207076614 నంబర్లను సంప్రదించాలి.

### ఓటు ఏకైక ఆయుధం

**తెనాలిటౌన్:** ప్రతి ఒక్కరికి ఓటు ఏకైక ఆయుధం, రాబోయే ఎన్నికల్లో ఆలోచన చేసి ఓటు వేయాలని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల పేర్కొన్నారు. గుంటూరు జిల్లా కొలకలూరు గ్రామంలోని పురవేదిక వద్ద గురువారం ఏర్పాటు చేసిన రచ్చబండ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్ వలీ అధ్యక్షత వహించారు. రచ్చబండలో పలువురు మహిళలు, యువకులు, న్యాయవాదులు, రైతులు తమ సమస్యలను తెలియజేశారు. సమావేశంలో నాయకులు కేవీపీ రామచంద్రరావు, జె.డి.శీలం, ఎస్.రఫ వీరారెడ్డి, కనుమూరి బాపిరాజు, కొప్పుల రాజు, లింగంశెట్టి ఈశ్వరరావు, వణుకూరి శ్రీనివాసరెడ్డి, కారుమంచి రమాదేవి, డాక్టర్ చందు సాంబశివుడు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జగనన్న గోరుముద్ద.. పోషకాలు మెండు

- పాఠశాలల్లో భోజనం చేస్తున్న ఎక్కువ మంది విద్యార్థులు
- ఆరు రోజులు కోడిగుడ్డుతో భోజనం
- సంతృప్తి వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

**తెనాలిఅర్బన్:** ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మంచి పౌష్టికాహారాన్ని అందించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన జగనన్న గోరుముద్దకు విశేష ఆదరణ లభిస్తోంది. పాఠశాలల్లో చదివే ఎక్కువ మంది విద్యార్థులు ఇక్కడే భోజనం చేస్తుండటంతో పాటు వారికి గతంలో ఎన్నడు లేని విధంగా రుచికరమైన భోజనం అందిస్తుండటంతో సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

● తెనాలి పట్టణ, మండల పరిధిలో 97 పాఠశాలలున్నాయి. పట్టణ పరిధిలో 49, మండల పరిధిలో 48 ఉన్నాయి. వీటిలో 10,403 మంది విద్యనభ్యసిస్తున్నారు. వీరిలో పట్టణ పరిధిలో 6,294 మంది, మండల పరిధిలో 4,109 మంది ఉన్నారు. వీరందరికి సీఎం జగన్ నేతృత్వంలోని ప్రభుత్వం పోషక విలువతో కూడిన మధ్యాహ్న భోజనం అందించాలనే ఉద్దేశంతో జగనన్న గోరుముద్దలో సమూల మార్పులు తెచ్చారు. ప్రస్తుతం తెనాలి పరిధిలో 10,403 మందికి గాను 8,092 మందికిపైగా భోజనం చేస్తున్నట్లు రికార్డులు చెబుతున్నాయి. పట్టణ పరిధిలో 4,661, మండల పరిధిలో 3,431 మంది ఉన్నారు.



ఎస్‌సీఆర్ స్కూల్‌లో భోజనం వడ్డిస్తున్న సిబ్బంది

**మెనూలో సమూల మార్పులు తెచ్చిన ప్రభుత్వం..**

గత ప్రభుత్వంలో మధ్యాహ్న భోజనం కింద అన్నం, కూర, సాంబారు వంటి వాటిని మాత్రమే పెట్టేవారు. అవి కూడా సుద్దలు సుద్దలుగా, నీళ్ల సాంబారు వంటివి అందించేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత మెనూలో సమూల మార్పులు చేశారు. గతంలో అందని ద్రాక్షలా మారిన కోడిగుడ్డును సైతం వారంలో ఆరు రోజులు పెట్టే విధంగా చర్యలు తీసుకున్నారు. వీటితో పాటు రాగి జావను మూడు రోజులు పంపిణీ చేస్తున్నారు. దీంతో విద్యార్థులు పాఠశాలలోనే మధ్యాహ్న భోజనం చేస్తున్నారు.



భోజనం చేస్తున్న విద్యార్థినులు

**మెను వివరాలు ఇవి..**

| | |
|---|---|
| మంగళవారం – | పులిహోర, టమాట పచ్చడి, దొండకాయ పచ్చడి, ఉడికించిన గుడ్డు, రాగిజావ |
| బుధవారం – | కూరగాయల అన్నం, బంగాళాదుంప కుర్మా, ఉడికించిన గుడ్డు, వేరుశనగ చిక్కి |
| గురువారం – | సాంబార్ బాత్, ఉడికించిన గుడ్డు, రాగిజావ |
| శుక్రవారం – | అన్నం, ఆకుకూరపప్పు, ఉడికించిన గుడ్డు, వేరుశనగ చిక్కి |
| శనివారం – | ఆకుకూర అన్నం, పప్పుచారు, తీపి పొంగలి, రాగిజావ |

పై మెను పరిశీలిస్తే రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో విద్యార్థులకు ఎలాంటి పౌష్టికాహారం అందిస్తుందో అర్థమవుతుంది.

**భోజనం బాగుంటుంది..**



ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నం అందిస్తున్న భోజనం చాలా బాగుంటుంది. నేను ప్రతి రోజు ఇక్కడే భోజనం చేస్తున్నాను. మెను ప్రకారం ప్రతి రోజు భోజనం ఏర్పాటు చేస్తున్నారు. కొద్ది నెలల నుంచి రాగి జావ కూడా ఇస్తున్నారు. భోజనం రుచిగా కూడా ఉంటుంది.

–ఆర్ చరణ్‌జీ, 9వ తరగతి, ఎస్‌సీఆర్‌ఎస్‌ఎంహెచ్ స్కూల్, తెనాలి

**మంచి పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు..**



నేను ఈ సంవత్సరం ఎస్‌సీఆర్ స్కూల్‌లో 6వ తరగతిలో చేరాను. మొదట్లో ఇక్కడ భోజనం ఎలా ఉంటుందోనని బాక్స్ తెచ్చుకున్నాను. నా తోటి విద్యార్థులు ఇక్కడే ఎక్కువ మంది తింటుండటంతో నేను తినటం ప్రారంభించాను. చాలా బాగుంటుంది. అంతేకాకుండా వారంలో ఆరు రోజులు మంచి పోషక విలువలున్న కోడి గుడ్డు, చిక్కిలు, పొంగల్ వంటివి అందిస్తున్నారు.

–కొత్తపల్లి సుమ, ఆరోవ తరగతి, ఎస్‌సీఆర్‌ఎస్‌ఎంహెచ్ స్కూల్, తెనాలి

**గతంతో పోల్చుకుంటే ప్రస్తుత మెను చాలా బాగుంది..**



ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిరోజు అందించే భోజన పదార్థాలు వేడి వేడిగా ఉంటున్నాయి. ప్రతిరోజు ఒక ఉపాధ్యాయుడు వాటిని ముందుగా పరీక్షించి విద్యార్థులకు పంపిణీ చేయటం జరుగుతుంది. విద్యార్థుల అభిప్రాయాలు కూడా ప్రతి రోజు తీసుకుంటున్నాం. గతంతో పోల్చితే ఇప్పుడు భోజనం రుచికరంగా ఉండటంతో పాటు పోషక విలువలున్న ఆహారం అందించటం అభినందనీయం.

–కె.ప్రదీప, ఇంగ్లీష్ ఉపాధ్యాయురాలు, ఎస్‌సీఆర్‌ఎస్‌ఎంహెచ్ స్కూల్, తెనాలి

### అక్కచెల్లెమ్మల ఆసరా సంబరాలు



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఏపీఎం, జ్ఞానదీపం గ్రూపు సభ్యులు

**మున్నంగి(కొల్లిపర):** అక్క చెల్లెమ్మలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని, వారికి ఆర్థికంగా ఆసరానిస్తూ వారి కుటుంబాల ఉన్నతికి తోడ్పాటు అందిస్తోందని ఏపీఎం ప్రియదర్శిని తెలిపారు. గురువారం మండలంలోని మున్నంగి గ్రామంలోని జ్ఞానదీపం మహిళా గ్రూపు వారు ప్రభుత్వం నాలుగవ విడత వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా డ్వాక్రా రుణమాఫీ చేయటంతో వారి ఖాతాలో డబ్బులు జమ అవటంతో సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం ప్రయదర్శిని మాట్లాడుతూ మండలంలో 1400 డ్వాక్రా గ్రూపులు ఉండగా వాటిలో 1247 గ్రూపులకు ఆసరా ద్వారా రూ.9.81 కోట్ల రుణమాఫీ జరిగిందని, నాలుగు విడతలలో మొత్తం రూ.39.80 కోట్లు రుణమాఫీ జరిగిందన్నారు. అత్యధికంగా మున్నంగి గ్రామంలోని జ్ఞానదీపం మహిళా గ్రూపు సభ్యులకు ప్రతి సంవత్సరం రూ.1.94 లక్షలు, నాలుగు విడతల్లో రూ.7.76 లక్షలు రుణమాఫీ జరిగిందని, గ్రూపు సభ్యులలో ఉయ్యూరు ధనలక్ష్మి కిరాణా దుకాణం, ఆళ్ళ ప్రశాంతి కుట్టు మిషన్‌లు, వంగా సుజాత పాడి గేదెల ద్వారా ఆర్థికంగా ఎదుగుతూ మిగతా మహిళలకు ఆదర్శంగా నిలిచారన్నారు. అనంతరం జ్ఞానదీపం మహిళా గ్రూపు సభ్యులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి, పలువురికి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో సీసీ యుగంధర్, గ్రూపు యానిమేటర్ ఈద భవాని, సభ్యులు ధనలక్ష్మి, ప్రశాంతి, సుజాతరెడ్డి, శివమ్మ, లక్ష్మిప్రియ, విమలకుమారి, సత్యవతి, సరోజిని, ఉమాదేవి, రాధిక తదితరులు పాల్గొన్నారు.

## టాపర్స్‌గా ఉంటేనే జీవితం బాగుంటుందనేది అపోహ

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.మన్మథరావు

**తెనాలి:** చదువుతో జీవన గమనాన్ని నిర్దేశించుకోవటం విద్యార్థి తెలుసుకోగలగాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.మన్మథరావు అన్నారు. టాపర్స్‌గా ఉంటేనే జీవితం బాగుంటుందనేది కేవలం అపోహ మాత్రమేనని చెప్పారు. టెన్త్ క్లాస్ థర్డ్‌క్లాస్‌లో పాసైన తానే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనమన్నారు. పట్టణ బోసురోడ్డులోని నెహ్రూనికేతన్ విద్యాసంస్థ స్వర్ణోత్సవాల్లో రెండోరోజైన గురువారం రాత్రి జరిగిన సభలో ముఖ్యఅతిథి జస్టిస్ మన్మథరావు మాట్లాడుతూ, టాపర్‌ను కాకున్నా తాను ఎన్నడూ చదువును నిర్లక్ష్యం చేయలేదన్నారు. తల్లిదండ్రులు ఏం చేయాలో చెప్పకున్నా న్యాయవాద కోర్సు చేశానని, ప్రాక్టీస్ చేస్తూనే పదేళ్ల తర్వాత మళ్లీ చదువుకుని, ఈ హోదాలో ఇప్పటికీ చదువుకునే వృత్తిలో కొనసాగుతున్నానని చెప్పారు. ఏ కష్టాన్ని అయినా ఇష్టంగా భావిస్తూ విద్యార్థులు ముందుకు సాగాలన్నారు. అందివచ్చిన టెక్నాలజీని విచక్షణతో వినియోగించాలన్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లల్ని ఒత్తిడికి లోను చేయకుండా తమ కర్తవ్యాన్ని సమర్థంగా నిర్వహించాలని సూచించారు. సౌతిండియా లీడ్ స్కూల్ జోనల్ అకడమిక్ ఎక్స్‌లెన్స్ లోలక్ తన ప్రసంగంలో తమ కరికులమ్‌ను అనుసరిస్తున్న వేలాది స్కూళ్లలో ప్రముఖంగా ఉన్న నెహ్రూనికేతన్‌ను అభినందించారు. విద్యాసంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మురళీకాంత్ వి.దాసరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గీతాకాంత్ మాట్లాడారు. వ్యవస్థాపకుడు దాసరి ప్రకాశరావు–లక్ష్మీప్రకాష్ పర్యవేక్షించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. తొలుత జస్టిస్ కె.మన్మథరావును ఘనంగా సత్కరించారు.



మాట్లాడుతున్న జస్టిస్ కె.మన్మథరావు

### రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు



**తెనాలిరూరల్:** తెనాలి మండల గ్రామం అంగలకుదురు వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. పోలీసుల కథనం మేరకు గ్రామానికే చెందిన 33 ఏళ్ల ఉప్పలపాటి నాగరాజు బైకు పై తెనాలి నుంచి ఇంటికి వెళుతుండగా గ్రామంలోని ఎస్‌బీఐ వద్ద గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలపాయ్యాడు. గ్రామస్తులు వైద్యశాలకు తరలించగా పరిస్థితి అత్యంత విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. రూరల్ పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

## ట్రాఫిక్ సిగ్నల్స్‌పై చిత్రలేఖన పోటీలు

**తెనాలి:** తెనాలి వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. మొత్తం 20 ప్రభుత్వ/ప్రైవేటు పాఠశాలలకు చెందిన 6–10వ తరగతి విద్యార్థులు 600 మంది ఈ పోటీల్లో పాల్గొన్నారు. 35వ జాతీయ రహదారి భద్రత నెలలో భాగంగా 'రోడ్ సేఫ్టీ అండ్ ట్రాఫిక్ సిగ్నల్స్' అంశంపై ఈ పోటీని నిర్వహించారు. కాంటినెంటల్ కాఫీ లిమిటెడ్ జనరల్ మేనేజర్ బలరాం, వైష్ణవి జూనియర్ కాలేజి చైర్మన్ పాటిబండ్ల శ్రీనివాసరావు, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు అచ్యుత సాంబశివరావు, చిత్రకళా ఉపాధ్యాయుడు తురుమెళ్ల విజయప్రకాష్, అలపర్తి వెంకటేశ్వరరావు, రాజేంద్ర ప్రసాద్, పీఈటీ స్వప్న, శిరీష పాల్గొన్నారు. నిర్వాహక సొసైటీ సభ్యుడు సునీల్ పర్యవేక్షించారు. విజేతలకు 10వ తేదీన తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో ఉదయం 10 గంటలకు జరిగే సభలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, కాంటినెంటల్ కాఫీ చైర్మన్ చల్లా రాజేంద్ర ప్రసాద్ చేతుల మీదుగా బహుమతులను అందజేస్తారని వివరించారు.



## నేడు ఆలపాటి–వెలగా పురస్కారాల ప్రదానం

**తెనాలి:** పట్టణంలోని ఆలపాటి కళావతి రవీంద్ర పీఠం ఆధ్వర్యంలో ఆలపాటి రవీంద్రనాథ్–కళావతి సంస్మరణ సభను శుక్రవారం ఉదయం 10 గంటలకు స్థానిక శాఖాగ్రంథాలయం హాలులో నిర్వహించనున్నారు. ఈఎల్‌వీ అప్పారావు స్వాగతం పలికే సభకు డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు అధ్యక్షత వహిస్తారు. ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి, యర్రంశెట్టి హనుమంతరావు, పావులూరి శ్రీనివాసరావు అతిథులుగా పాల్గొంటారు. 1940 దశకంలో తెనాలి నుంచి జ్యోతి, రేరాణి, కినిమా వంటి ప్రసిద్ధ పత్రికలను నడిపి, ఎందరో రచయితలను సాహితీలోకానికి అందించిన ఆలపాటి రవీంద్రనాథ్, తర్వాత కాలంలో తన ముద్రణా విభాగాన్ని హైదరాబాద్‌కు మార్చారు. అక్కడ మిసిమి మాసపత్రికను ప్రారంభించారు. ఆయన సంస్మరణార్థం ఏటా ఆలపాటి రవీంద్రనాథ్ పురస్కారాన్ని ప్రదానం చేస్తున్నారు. ఈ ఏడాది ప్రముఖ సామాజిక సేవకురాలు, డీ3 శారద సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకురాలు డాక్టర్ శారదను ఈ పురస్కారంతో సత్కరించనున్నారు. ఇదే వేదికపై గ్రంథాలయ రంగంలో విశేషంగా కృషిచేసి 'నడిచే గ్రంథాలయం' అనిపించుకున్న స్వర్గీయ వెలగా వెంకటప్పయ్య పేరిట కూడా అవార్డును ప్రదానం చేస్తున్నారు. ఈ ఏడాదికి శ్రీషిరిడి సాయి సేవాసమితి వ్యవస్థాపకుడు 'గానకళారత్న' వెంపటి సత్యనారాయణను వెలగా పురస్కారంతో సన్మానిస్తారు. గ్రేడ్–1 లైబ్రేరియన్ కావూరి రమాదేవి, ఇతర అతిథులు పాల్గొంటారు.

### మహిళ ఫొటోలు మార్ఫింగ్ చేసిన వ్యక్తిపై కేసు

**గుంటూరు ఈస్ట్:** మహిళ ఫొటోలు మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పెడుతున్న సంఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పట్టాభిపురంలో నివాసం ఉండే ఓ మహిళ ఫొటోల్ని వ్యక్తి మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పెడుతున్నాడు. గుర్తించిన మహిళ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**వృద్ధుడి ఆత్మహత్య**

వృద్ధుడి ఆత్మహత్యపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఏటీ అగ్రహారానికి చెందిన వెంకటరమణారెడ్డి (72) అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మానసికంగా కుంగిపోయి బుధవారం రాత్రి ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోలీసులు మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**మనస్తాపంతో మహిళ...**

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసునమోదు చేశారు. శాంతీనగర్‌కు చెందిన మల్లెల అలేఖ్య (30) వ్యక్తిగత కారణాలతో మానసికంగా కుంగిపోయి బుధవారం రాత్రి ఇంట్లో ఫ్యానుకు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతి చెందింది. మృతదేహాన్ని పోలీసులు మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ వేగవంతం

- మున్సిపల్ కార్యాలయంలో రెండు విభాగాల ఏర్పాటు
- 40 ప్రత్యేక కౌంటర్లతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ
- తొలిరోజు 500 పైగా పూర్తయిన రిజిస్ట్రేషన్లు

**తెనాలి:** పట్టణ మున్సిపాలిటీ పరిధిలో ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్‌ను వేగవంతం చేశారు. సచివాలయాల్లో ఈ ప్రక్రియ మందకొడిగా సాగుతోందని భావించిన అధికారులు మున్సిపాలిటీకి మార్చారు. మున్సిపల్ కార్యాలయంలో రెండు చోట్ల 40 కౌంటర్లను ఏర్పాటు చేసి మరీ రిజిస్ట్రేషన్లను ప్రారంభించారు. అప్పుడప్పుడూ సర్వర్ మొరాయించినా, అంచనాలకు తగినట్టుగా తొలిరోజు రాత్రికి 500పైగా ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్ చేయగలిగారు.

ఉమ్మడి గుంటూరు జిల్లాలో గుంటూరు నగరం తర్వాత తెనాలి నియోజకవర్గంలోనే అత్యధికంగా పేదలకు ఇళ్ల స్థల పట్టాలను పంపిణీ చేసిన విషయం తెలిసిందే. గతంలో ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో 27 వేల మంది పేదలకు ఇళ్ల స్థలాలను అందజేశారు. కేవలం తెనాలి పట్టణంలో 20 వేల మందికి పట్టాలను పంపిణీ చేశారు. పేదలకిచ్చే ఇళ్లస్థలాల పట్టాలను రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలనే ప్రభుత్వం సంకల్పం, అన్ని అవరోధాలను అధిగమించి, ఇప్పటికి కార్యాచరణకు వచ్చింది. ఈ నెల 2వ తేదీ నుంచి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ రాష్ట్రవ్యాప్తంగా ఆరంభమైన విషయం తెలిసిందే. గ్రామ, వార్డు సచివాలయాల్లో ఇందుకోసం ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేసింది. ప్రభుత్వం తరపున వీఆర్‌వోలు రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు.

ఈ నేపథ్యంలో పట్టణంలోని సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ల వ్యవహారం మందకొడిగా సాగుతోంది. అప్పుడప్పుడు సంబంధిత సర్వరు నెమ్మదిగా ఉండటం, కొన్ని సాంకేతిక సమస్యలు ఎదురవటం ఇందుకు కారణం. రికార్డు సంఖ్యలో ఉన్న ఇళ్లస్థలాల రిజిస్ట్రేషనులో జాప్యం లేకుండా సాధ్యమైనంత త్వరగా పూర్తిచేయాలనే భావనతో మున్సిపల్ అధికారులు గురువారం నుంచి లబ్ధిదారులను మున్సిపాలిటీకి ఆహ్వానించారు. మొత్తం 40 కౌంటర్లను ఏర్పాటుచేసి, రిజిస్ట్రేషన్ల ప్రక్రియను చేపట్టారు. లబ్ధిదారులతో మున్సిపల్ కార్యాలయం కిటకిటలాడింది. అంత రద్దీలోనూ సిబ్బంది ఓపికగా ప్రక్రియను కొనసాగించారు.

గతంలో ఏ ప్రభుత్వమైనా ఇళ్ల స్థలాలను ఇవ్వాలంటే డీ–పట్టాలనే ఇచ్చేవారు. ఎలాంటి హక్కులు ఉండేవి కావు. బ్యాంకులు రుణాలు ఇచ్చేవి కావు. అవసరమైతే అమ్మాలన్నా సగం ధర కూడా వచ్చేది కాదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పూర్తి హక్కులతో రిజిస్ట్రేషన్ చేసి పట్టాలను ఇవ్వాలని భావించారు. ఆ ప్రకారం రిజిస్ట్రేషన్ ఆయ్యాక కన్వేయన్స్ డీడ్స్‌ను ఇస్తారు. పదేళ్ల తర్వాత పట్టాలు ఆటోమేటిక్‌గా సేల్ డీడ్‌గా మారతాయి. ఈలోగా కన్వేయన్స్ డీడ్స్‌తో బ్యాంకుల నుంచి రుణాలు పొందటానికి వీలుంది. అందుకే లబ్ధిదారులు రిజిస్ట్రేషన్‌కు ఎంతో ఉత్సాహంగా ముందుకొచ్చారు.



ప్రత్యేక కౌంటర్లలో ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్లు

**ఇళ్లస్థలం పట్టా రిజిస్ట్రేషన్ బాగుంది...**



నాకు పెళ్లయి 15 ఏళ్లయింది. షాపులో పని. అద్దె ఇంట్లోనే నివాసం. జగనన్న ప్రభుత్వం ప్రభుత్వంలో ఇంటి స్థలం ఇచ్చారు. ఇప్పుడు రిజిస్ట్రేషన్ చేసి మరీ ఇస్తున్నారు. చాలా సంతోషంగా ఉంది. అమ్మ ఒడి పథకంతో బిడ్డను చదివిస్తున్నాను.

– పెంచికల అంకమ్మ, సీబీఎస్ కాలనీ

**ఇల్లు శ్లాబ్ వరకు వచ్చింది...**



నేను వైరు కుర్చీలు అల్లుతాను. నా భర్త కార్పెంటరీ పని చేస్తారు. పెళ్లయి 13 ఏళ్లయినా ఇంటి స్థలం వచ్చింది ఈ ప్రభుత్వంలోనే. శ్లాబు వరకు నిర్మాణం పూర్తయింది. రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వటమంటే ఎంతో ఆనందంగా ఉంది.

– షేక్ రేష్మ, నందులపేట

**రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వటం ఇప్పుడే...**



ఇళ్ల స్థలాల పట్టాల రిజిస్ట్రేషన్ గతంలో ఎన్నడూ వినలేదు. మాకిచ్చిన స్థలం పట్టాను ఇప్పుడు రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. దీనివల్ల మా సొంత భూమి అన్న భరోసా వస్తుంది. ఇప్పటికే మా ఇల్లు శ్లాబ్ వరకు వచ్చింది.

– షేక్ నూర్జహాన్, నందులపేట

**వేగంగా ప్రక్రియ పూర్తిచేయాలనే...**



వేలాదిగా ఉన్న ఇళ్ల స్థలాల పట్టాల రిజిస్ట్రేషన్ సాధ్యమైనంత త్వరగా చేయాలనే ప్రత్యేక కౌంటర్లతో చేయిస్తున్నాం. రద్దీ నివారణకు టోకెన్లు ఇస్తున్నాం. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది చెప్పిన లబ్ధిదారులు ఇక్కడకొస్తే సరిపోతుంది.

– బండి శివన్న, మున్సిపల్ కమిషనర్

## మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

**తెనాలిరూరల్:** నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అరెస్ట్ చేశారు. తెనాలి మండలం గుడివాడ గ్రామంలో అనధికార మద్యం విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారంతో ఎస్ఈబీ తెనాలి ఇన్‌స్పెక్టర్ వీ చలం, సిబ్బంది గురువారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తి నుంచి 11 సీసాలు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు.

### ఎస్ఎంఆర్‌లను క్రమబద్ధీకరించండి

**గుంటూరు వెస్ట్:** 1993 నవంబర్‌కు ముందు నుంచి విధులు నిర్వహిస్తున్న 2,931 మంది ఎస్ఎంఆర్‌లను క్రమబద్ధీకరించాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చాంద్ బాషా కోరారు. స్థానిక కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రతి శాఖలో దాదాపు 30ఏళ్లుగా ఎస్ఎంఆర్‌లు పనిచేస్తున్నారనితెలిపారు.